క్లుప్తంగా

16, 17 తేదీల్లో బీకేఎంయూ వర్క్‌షాప్

ఏలూరు (టూటౌన్) : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు ఈ నెల 16, 17 తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్నట్టు బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. వర్క్‌షాప్‌లో ఉపాధి హామీ చట్టం, గ్రామీణ కష్టజీవులు - సంక్షేమం - అభివృద్ధిపై మేధావులు ప్రసంగిస్తారని, గ్రామీణ పేదల సమస్యలు, తదితరల అంశాలపై చర్చిస్తామని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లా నుంచి ఎంపికైన వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తలు ఈనెల 16న ఉదయం 10.30 గంటలకు గుంటూరు కొత్తపేటలో ఉన్న సీపీఐ కార్యాలయం మల్లయ్య లింగం భవనానికి చేరుకోవాలని కోరారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు(మెట్రో): స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ కె.వెట్రి సెల్వి తెలిపారు. 2024-25 సంవత్సరంలో బీసీ-ఎ, బీసీ-బి, బీసీ-సీ, బీసీ-ఇ వర్గాల వారికి స్వయం ఉపాధి, జనరిక్ ఫార్మసీ, మేదర / కుమ్మరి శాలివాహన వాహన వారికి వృత్తి పరంగా బుట్టల అల్లకం / కుండల తయారీకి, ఆర్యవైశ్య, రెడ్డి, కమ్మ, బ్రాహ్మిణ్, ఈబీసీ సామాజిక వర్గాల వారికి జిల్లా బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి, జనరిక్ ఫార్మశి పథకాల కింద బ్యాంకులోను, ప్రభుత్వ సబ్సిడీ ఆర్థిక సాయం మంజూచేస్తారని పేర్కొన్నారు. కాపు, తెలగ బలిజ, ఒంటరి సామాజిక వర్గాల వారికి స్వయం ఉపాధి, గ్రూపు ఎంఎస్ఎంఈ క్రింద బ్యాంకులోను, ప్రభుత్వ సబ్సిడితో ఆర్థిక సాయం మంజూరవుతుందని పేర్కొన్నారు. దార్రిద్యరేఖకు దిగువనున్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈనెలల 22 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విజయభాస్కరరెడ్డి మృతికి సంతాపం



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జేపీ

ఏలూరు (టూటౌన్): స్థానిక తూర్పు వీధికి చెందిన బుసిరెడ్డి విజయ భాస్కర రెడ్డి శనివారం గుండె పోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహం వద్ద వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గం ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మరణం కుటుంబానికి తీరని లోటని, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్ గురునాథ్, మధ్యాహ్నపు ప్రభాకర్, ఫణి, రాజా, శంకర్, కోటి, లక్ష్మీపతి, సునీల్, గోపి ఉన్నారు.

ఆరోగ్య మిత్రల పోరుబాట

- వేతనాలు పెంపుకు డిమాండ్
- సోమవారాల్లో పెన్‌డౌన్
- 27న ట్రస్ట్ ముట్టడి



ఏలూరు జీజీహెచ్‌లో ఆరోగ్యశ్రీ డెస్క్

ఏలూరు టౌన్: రోగులు ఆరోగ్య పథకాన్ని వినియోగించుకునేందుకు తోడ్పాటు అందిస్తూ, సహాయకారులుగా ఆరోగ్య మిత్రలను నియమించారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టగా, రోగులకు ఆరోగ్య పథకం సేవలు సులువుగా అందుబాటులోకి తెచ్చేందుకు ఆరోగ్యమిత్రలను ఏర్పాటు చేశారు. సుమారు 17 ఏళ్లకు పైగా ఆరోగ్యమిత్రను ప్రజలకు సేవలు అందిస్తున్నారు. నేడు కూటమి సర్కారు అధికారం చేపట్టిన అనంతరం ఆరోగ్యమిత్రల భవితవ్యం గందరగోళంలోకి నెట్టేశారు. ఆరోగ్య పథకానికి మంగళం పాడేందుకు, బీమా సేవల్లో మార్పు చేసేందుకు సర్కార్ చేస్తోన్న ముమ్మర ప్రయత్నాలు ఆరోగ్యమిత్రలను తీవ్ర గందరగోళానికి గురిచేస్తున్నాయి. సోమవారం నుంచీ దశలవారీగా శాంతియుతంగా నిరసనకు సిద్ధపడుతున్నారు. తొలుత ప్రతి సోమవారం పెన్‌డౌన్, సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 27న ఆరోగ్యశ్రీ ట్రస్ట్ భవన్ ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్టు ఆరోగ్య మిత్రల యూనియన్ నాయకులు స్పష్టం చేస్తున్నారు.

సేవలు ఇలా..

ఏలూరు జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం అమలుకు 31 ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్స్, ఏలూరు జీజీహెచ్, ఏరియా హాస్పిటల్-2, సీహెచ్‌సీలు-6, పీహెచ్‌సీలు-57 ఉండగా, వీటిలో సుమారుగా 107 మందికి పైగా ఆరోగ్య మిత్రలు తమ సేవలు అందిస్తున్నారు. వీరు ఆరోగ్య సమస్యలపై హాస్పిటల్స్‌కు వచ్చిన రోగులకు అవగాహన కల్పిస్తూ ఆరోగ్యశ్రీ పథకం సేవలు వర్తించేలా సహాయం చేస్తారు. శస్త్ర చికిత్సలు ఇతరత్రా సేవలకు సంబంధించి నిత్యం ప్రభుత్వానికి, రోగులకు మధ్య సంధాన కర్తలుగా పనిచేస్తున్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని పక్కనబెట్టి, బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇక ఆరోగ్య మిత్రలను కొనసాగిస్తారా ? బీమా పథకం అమలు చేస్తే వీరి సేవలు ఏ విధంగా వినియోగించుకుంటారనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్స్‌లో సేవలు అందిస్తోన్న ఆరోగ్య మిత్రలు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన యువత ఆరోగ్యమిత్రలుగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిన నాటి నుంచీ సేవలు అందిస్తున్నారు. కానీ ఆప్కాస్‌లో వీరిని అటెండర్ స్థాయిలో చూపిస్తున్నారు. దీంతో ఆరోగ్యమిత్రలకు రూ.15 వేలు మాత్రమే వేతనంగా అందిస్తుండగా, చేతికి వచ్చేది రూ.13 వేలు మాత్రమే. ఈ నేపథ్యంలో ఆప్కాస్‌లో తమకు క్యాడర్ పెంచాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతున్నారు.

జీతం పెంచాలి, భద్రత కల్పించాలి



ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందించటంలో ఆరోగ్యమిత్రల పాత్ర కీలకంగా ఉంటుంది. పీజీ, డిగ్రీ చదివి ఆరోగ్యమిత్రలుగా 17 ఏళ్లుగా పనిచేస్తున్నాం. మాకు ఉద్యోగ భద్రత కల్పించటంతోపాటు, వేతనాలు పెంచాలి. ఆప్కాస్‌లో అటెండర్ స్థాయి మార్చివేసి సీనియార్టీ ఆధారంగా పదోన్నతులు కల్పించాలి. మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలి.

– ఎ.నాగబాబు, జిల్లా నాయకుడు, ఆరోగ్యమిత్రల యూనియన్

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



జయప్రకాష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న బాజీ

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం జాయింట్ సెక్రటరీగా నియమితులైన గాజుల బాజీ శనివారం పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ)ని మర్యాదపూర్వకంగా కలిశారు. తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ పదవులు చేపట్టిన నాయకులంతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వ వైఫల్యం, ప్రజా సమస్యలపై పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాస్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నేరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్ గుర్నాథ్, జిల్లా సెక్రటరీ బుద్దాల రాము, రాష్ట్ర వాణిజ్య విభాగ సెక్రటరీ బాచి, పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి



కాన్షీరామ్‌కి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఏలూరు ఎన్ఆర్‌పేట జే అండ్ జే కరుణోదయ సంస్థ కార్యాలయంలో జై కరుణోదయ సంస్థ, ఎస్సీ ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సంయుక్త ఆధ్వర్యంలో బహుజన నాయకులు, సమతవాది, మాన్యశ్రీ కాన్షీరామ్ 91వ జయంతి కార్యక్రమాన్ని శనివారం ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు మేతర అజయ్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. జే అండ్ జే కరుణోదయ సంస్థ చైర్మన్ కలతోటి డొమ్నిక్ మాట్లాడుతూ కాన్షీరాం అంటే బహుజన లకు ఉత్తేజం నింపిన నాయకులు అన్నారు. కాశీ కృష్ణ, అశోక్, అఖిల్, పవన్, రామ్, కుమార్, విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

- బహుజన రాజ్యాధికారం సాధించిన నప్పుడే కాన్షీరామ్‌కు నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు. కాన్షీరామ్ జయంతి కార్యక్రమం ఏలూరు కొత్త రోడ్డులోని నవసమాజ్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించారు. బహుజన సీనియర్ నాయకులు నేతల రమేష్ బాబు మాట్లాడుతూ బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు సాధించిన ఘనత ఈ దేశంలో ఒక్క కాన్షీరామ్‌కే దక్కుతుందన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సోమవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలు మానసిక ఒత్తిడులకు గురికాకుండా ప్రశాంతంగా రాయాలని స్థానిక ఏఆర్‌డీజీకే పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు మక్కా శ్రీను, సామాజిక కార్యకర్త గొంతిన రామకృష్ణ విద్యార్థులకు సూచించారు. శనివారం ఏఆర్‌డీజీకే పాఠశాల ఆవరణలో పదోవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభకు వారు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. పూర్వ విద్యార్థుల సంఘం తరపున టెన్త్ విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్స్, ఎరేజర్స్, షార్ప్‌నర్లు పంపిణీ చేశారు. మంచి ఫలితాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులకు స్కూల్ ఇన్‌చార్జి వి.కాంతి జయ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట, పాటలతో కార్యక్రమం ముగిసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డీఎస్ ఉజ్వల, వి.రామ్ మోహన్ రావు, బి.రామారావు, పి.శ్రీలత, ఎస్ భవాని, పి.పుల్లారావు, ఈ.శివ శంకర్‌రావు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు



భక్తులతో కిక్కిరిసిన దర్శనం క్యూలైన్లు



పెళ్లి జనాలతో నిండిన అనివేటి మండపాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు కళకళలాడాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కల్యాణకట్ట ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. వకుళమాత నిత్యాన్నదాన భవనం వద్ద ఉచిత అన్నప్రసాదం కోసం భక్తులు బారులు తీరారు. పార్కింగ్ ప్రదేశాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

పెళ్లి సందడి

ఫాల్గుణ మాసంలో మంచి ముహూర్తం కావడంతో శనివారం చినవెంకన్న క్షేత్రంలో పలు జంటలు మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యాయి. ఆలయ అనివేటి మండపం, పాదుకా మండపం వద్ద ఉన్న స్వామివారి కల్యాణ మండప ప్రాంతం, అలాగే కొండపైన, కొండ దిగువనున్న దేవస్థానం, ప్రైవేటు సత్రాలు, కల్యాణ మండపాలు వివాహాలకు వేదికలయ్యాయి. అనంతరం కొత్త జంటలు, వారి బంధు మిత్రులు శ్రీవారు, అమ్మవార్లను దర్శించుకున్నారు.

బెయిలీ వంతెన మరమ్మతులు చేయండి

భీమడోలు: గోదావరి కాల్వపై నిర్మించిన బెయిలీ వంతెన శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు చేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్ వట్టి భాస్కర్‌కు ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. గుండుగొలను కాల్వపై నిర్మిస్తున్న పక్కా వంతెన నిర్మాణం వెంటనే నిలిపివేయాలని కేంద్ర జలరవాణా శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడంతో ఆ వంతెన నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. దీనితో వంతెన నిర్మాణం ఎప్పటికీ పూర్తి అవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. వెంటనే ఎమ్మెల్యేలు, ఏలూరు ఎంపీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన కోరారు. ఈ క్రమంలో కాల్వలో రెండేళ్ల క్రితం నిర్మించిన బెయిలీ వంతెనపై భారీ వాహనాలు రాకపోకలతో మరమ్మతులకు గురైంది. ఆ వంతెనకు మరమ్మతులు చేపట్టాలని గత ఏడాది అక్టోబర్‌లో ఆర్ అండ్ బీ శాఖకు విన్నవించినా నిధుల కొరత సాకు చూపుతూ ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదన్నారు. ఈ వంతెనకు తక్షణమే మరమ్మతులు చేపట్టి, భారీ వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, అందుకు నిధులను మంజూరు చేయాలని ఆయన ఫిర్యాదు చేశారు.

బయ్యనగూడెంలో ఇల్లు దగ్ధం



కొయ్యలగూడెం: బయ్యనగూడెంలో 14వ తేదీ అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. మిద్దె శ్రీను ఇంటిలో షార్ట్ సర్క్యూట్ తో ప్రమాదం సంభవించిందని సర్పంచ్ ఎల్ఏ లక్ష్మి తెలిపారు. సర్వం కోల్పోయిన బాధితులను రెవెన్యూ అధికారులతో కలిసి ఆమె పరామర్శించారు. ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని తెలిపారు.

వినియోగదారుల హక్కులను పరిరక్షించాలి

భీమడోలు: వినియోగదారుల హక్కుల పరిరక్షణలో వినియోగదారుల హక్కుల కమిషన్ చేస్తున్న కృషి అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. పూళ్లలో శనివారం జిల్లా చైర్మన్ లింగంపల్లి మణికంత ఆదేశాల మేరకు జిల్లా వైస్ చైర్మన్ తుమ్మూరు ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జీవీ గిరిధర్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వినియోగదారుని అవగాహన లేమిని ఆసరాగా తీసుకుని వ్యాపారులు మోసం చేస్తున్నాయని, కొనుగోలు చేసుకున్న తరుణంలోనే తప్పనిసరిగా గడువు తేదీ, నాణ్యతా ప్రమాణాలను తెలుసుకుని కొనాలని సూచించారు. దుకాణదారుడు మోసం చేస్తే వినియోగదారుల హక్కుల కమిషన్ దృష్టికి తీసుకుని వెళ్లాలన్నారు. పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సభ్యులు నిమ్మల శ్రీనివాస్, కాసాని రామకృష్ణ, ఉప్పు గంగాధర్, బి.తులసీరావు, పాఠశాల టీచర్లు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

ఉంగుటూరు : మండలంలోని నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారులు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొండా రవి శ్రీధర్ మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం ప్రాముఖ్యత, వినియోగదారుల సమస్యలను పరిష్కరించే మార్గాలను వివరించారు. జి.రామ్మోహన్, ఐ.లావణ్య, జి.రఘునాథ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

చింతలపూడి: సంక్రాంతికి గుంతలు లేని రోడ్లు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం తక్షణం గుంతలు పూడ్చాలని సీపీఐ చింతలపూడి పట్టణ కమిటీ శనివారం డిమాండ్ చేసింది. ఈ మేరకు రోడ్లు, భవనాలశాఖ ఏఈ సుందర్రావుకు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. చింతలపూడి పట్టణంలోని గురుభట్ల గూడెం రోడ్డులో ఎక్కడ గుంతలు అక్కడే ఉన్నాయని, అదే విధంగా బైపాస్ రోడ్, చింతలపూడి నుంచి సుప్రీం పేట, పాత చింతలపూడి, నాగిరెడ్డిగూడెం వెళ్ళే రహదారులు ఎక్కడ గుంతలు అక్కడే ఉన్నాయన్నారు. కార్యకక్రమంలో తోర్లపాటి బాబు, ఎస్‌కే కాలేషా, తాడిగడప మాణిక్యాలరావు, మోర్తా లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

జంగారెడ్డిగూడెం: ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి జంపన వెంకటరమణరాజు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

సారా నిర్మూలనకు సహకరించాలి

ద్వారకాతిరుమల: గ్రామాల్లో సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ అవులయ్య కోరారు. ఎక్సైజ్ శాఖ డీసీ శ్రీలత ఆదేశాల మేరకు మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో శనివారం నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. అవులయ్య మాట్లాడుతూ సారా తయారీ, విక్రయాలను మానుకోవాలని సూచించారు. ఈ మేరకు గ్రామ పెద్దలు, ప్రభుత్వ అధికారుల సమక్షంలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్లు పాండురంగారావు, అజయ్ కుమార్ సింగ్, తహసీల్దార్ జీవీ సుబ్బారావు, సీఐ యుజే విల్సన్, ఎక్సైజ్ సీఐ బి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, పి.నరసింహమూర్తి, డి.నరసింహమూర్తి, డ్వాక్రా మహిళలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పీసా చట్టంపై అవగాహన అవసరం

పోలవరం రూరల్: పీసా చట్టంపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని పరిశీలకులు పద్మజ అన్నారు. పోలవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద పీసా చట్టంపై శిక్షణా తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ట్రైనింగ్ మేనేజర్ జి.ప్రసంగిరాజు, ఎంపీడీఓ కె.శ్రీనివాసులు చట్టంపై అవగాహన కల్పించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వార్డు సభ్యులు, వెలుగు కార్యాలయం సిబ్బంది, స్వయం సహాయ సంఘం మహిళా లీడర్లు, పీసా చట్టం సభ్యులు పాల్గొన్నారు.

కష్టాలను విశ్వాసంతో జయించాలి



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న బిషప్ జయరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : విశ్వాసులు క్రీస్తు శ్రమల కాలంలో క్రీస్తు శిలువ శ్రమలను ధ్యానం చేసుకుని, తమ కష్టాల్లో, శోధనల్లో స్థిరంగా నిలబడి, విశ్వాసంతో వాటిని జయించాలని ఏలూరు పీఠాధిపతి, విశాఖ అగ్రపీఠం అపోస్తలిక పాలనాధికారి బిషప్ జయరావు పొలిమేర సూచించారు. స్థానిక గ్జేవియర్ నగర్‌లోని అమలోద్భవి కథీడ్రల్ ఆలయ ఆవరణలో విచారణ కర్త ఫాదర్ ఇంజమాల మైఖేల్ ఆధ్వర్యంలో రెండో సువార్త కూటాలకు జయరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రార్థనలు చేశారు. ముఖ్య ప్రసంగికులు ఫాదర్ లలాము జయరాజు మాట్లాడుతూ ఏసుక్రీస్తు మానవుల రక్షణార్థం తన శరీర రక్తాలను, జీవమును త్యాగం చేసినట్టుగా విశ్వాసులు ఒకరి పట్ల ఒకరు త్యాగబుద్ధితో, దాన గుణంతో జీవించాలని సూచించారు. కూటాల్లో సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ టి.ఇమ్మానియేలు, ఫాదర్లు స్టీవెన్ థామస్, బి.రాజు, ఎస్ థామస్, జె.బెనర్జీ, కార్పొరేటర్ ఎం నిర్మల, ఐ.రత్నరాజు, దీక్షా స్వాములు, విశ్వాసులు పాల్గొన్నారు.

జూట్, క్లాత్ బ్యాగులను వినియోగించాలి

ఏలూరు (టూటౌన్): ప్లాస్టిక్ నిషేధంపై శనివారం నగర పాలకసంస్థ ఆధ్వర్యంలో ఆర్ఆర్ పేటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూట్, క్లాత్ బ్యాగులను వినియోగించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య (చంటి), మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబులు దుకాణాలకు వెళ్లి దుకాణాదారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని, ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, డీఆర్డీఏ పీడీ ఆర్ విజయరాజు, సెట్ వెల్ సీఈఓ ప్రభాకరరావు, మునిసిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు, జున్నూరు కనక నరసింహారావు, పాము శ్యామ్యూల్, ఈదుపల్లి పవన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏలూరు మండల పరిషత్ సమావేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీడీఓ వి.శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ పెనుమత్స శ్రీనివాసరాజు అధ్యక్షత వహిస్తారని, గ్రామాల్లో అభివృద్ధి పనులపై చర్చిస్తారని పేర్కొన్నారు.

జాబ్‌మేళాలో 14 మందికి కొలువులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 14 మందికి ఉద్యోగావకాశాలు లభించాయలని కళాశాల ప్రిన్సిపాల్ పి.రజిత ఒక ప్రకటనలో తెలిపారు. సంగీత మొబైల్స్, వేరియంట్ ప్రైమరీ స్కూల్, పేటీఎం కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా, 31 మంది యువత హాజరయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి మధు భూషణ్ రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జితేంద్ర బాబు, ఈవోపీ జి.వరలక్ష్మి పాల్గొన్నారు.

ముగ్గురమ్మల సేవలో భక్తులు

గణపవరం: మండలంలోని పిప్పర గ్రామ దేవతలు ముగ్గురమ్మల జాతర మహోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. పిప్పర పరిసర గ్రామాల నుంచేకాక మండలంలోని పలు గ్రామాల పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి మహాలక్ష్మి, మహంకాళి, బంగారుపాప అమ్మవార్లకు పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ఆవరణలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	32	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	40	బీన్లచిక్కుడు	90
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	48
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	76
కాకర కాయలు	30-40	బీట్‌రూట్	30
బీరకాయలు (పందిరి)	44	కీరా దోస	36
కాలీఫ్లవర్	--	ఫ్రెంచ్‌బీన్స్	68
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	28	తోటకూర	10
ఉల్లిపాయలు	35	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	50
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	03
ఏలూరు జీడిమెట్ల వయా ఖమ్మం (ఇంద్ర)	20.15	17
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	04
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	01
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	05
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	02
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	06
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	02
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	04
ఏలూరు - తిరుపతి	16.00	4830	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.40	98517	34
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.10	98503	34